క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తెర్లాం: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు క్విజ్ పోటీలు దోహదపడతాయని తెర్లాం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక జ్ఞానం, జనరల్ నాలెడ్జ్ ఎంతమేరకు ఉందో తెలుసుకొనేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. విజేతలకు శిబిరం ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

బాడంగి: ఈ నెల 24 నుంచి జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. స్థానిక కళాశాలలో సోమవారం మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు రెండు పూటలా పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయన్నారు. తమ కళాశాలకు చెందిన 60 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



పూజల్లో పాల్గొన్న భక్తులు

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితుడు అలజంగి శ్రీనివాసాచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. తెర్లాం, బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మట్టినమూనాల సేకరణకు సహకరించండి

రాజాం: గ్రామాల్లో రైతుల పంటపొలాల్లో మట్టినమూనాల సేకరణ ప్రారంభిస్తున్నామని, రైతులు సహకరించాలని వ్యవసాయశాఖ ఏఓ ఎ.రేణుకాసాయి కోరారు. రాజాం వ్యవసాయశాఖ కార్యాలయంలో పలు గ్రామాల వీఏఏలతో సోమవారం సమావేశం నిర్వహించారు. పంట దిగుబడులు తక్కువగా ఉన్న పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి, రాజాం అగ్రిల్యాబ్‌లో టెస్టులు చేయించాలని సూచించారు. గ్రామాల్లో రైతులు కూడా తమ పంటపొలాల్లో సోయిల్‌ను టెస్ట్ చేసేందుకు సహకరించి కోరారు.

ఘనంగా తోలేళ్ల సంబరం

● నేడు సిరిమానోత్సవం



పాత బొబ్బిలిలో సిద్ధమవుతున్న సిరిమాను

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు గొల్లపల్లి దాడితల్లి, పాత బొబ్బిలి సరే పోలమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం తోలేళ్ల సంబరాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

నేడు సిరిమానోత్సవం

గొల్లపల్లి దాడితల్లి, పాత బొబ్బిలి సరే పోలమ్మ అమ్మవార్ల సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. సిరిమాను తిరిగే ప్రాంతాలను డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు, కమిషనర్ రామలక్ష్మి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు.

మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

• బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం: పార్టీ నాయకులతో సమావేశమైన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం మరోసారి ఖాయమని, రాష్ట్రంలోను, జిల్లాలోను అఖండ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో గ్రామాల వారీగా ఓటింగ్ సరళిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. తెర్లాం మండలం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని, ఈ ఎన్నికల్లో కూడా గతంలో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపులో రాష్ట్రంలోను, బొబ్బిలి నియోజకవర్గంలోను వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు.

తన గెలుపుపై నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, తప్పనిసరిగా తానే ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకున్నారన్నారు. జూన్ 4న వచ్చే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ రెండోసారి విజయఢంకా మోగించనుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి బాబ్జీరావు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు శేషగిరి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



రేగిడి: పార్టీ కార్యకర్తల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

• ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రాజాం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు రాజగోపాలనాయుడు

రేగిడి: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుంధుభి మోగిస్తుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మునకలవలస గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయన్నారు. మహిళలు, వృద్ధులు, రైతులు, యువత వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఓట్లు వేశారని వెల్లడించారు. పార్టీ గెలుపునకు పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌పై కార్యకర్తలను ఆరా తీశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, స్థానిక సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ శాసపు తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: రాష్ట్రంలోను, రాజాం నియోజకవర్గంలోను వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. రాజాంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని పలు పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమై గ్రామాల వారీగా పోలింగ్ సరళిపై ఆరా తీశారు. 2019లో వైఎస్సార్‌సీపీకి వచ్చిన మెజార్టీ కంటే ఈ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజాం మండలం నుంచి 3 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ వస్తుందని, ఎమ్మెల్యేగా డాక్టర్ తలే రాజేష్ 18 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తారని జోష్యం చెప్పారు. ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ ముదిలి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

కుండపోతగా వర్షం

సంతకవిటి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో పాటు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో పాటు ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో ఉక్కపోత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

వన్నలిలో వైద్య శిబిరం



వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ సోహినీరాఘవ్

రేగిడి: ప్రజారోగ్య సంరక్షణే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సోహినీరాఘవ్ అన్నారు. మండలంలోని వన్నలి గ్రామంలో సోమవారం 104 ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలకు కేటాయించిన సంబంధిత వారాల్లోనే 104 వస్తుందని, 14 రకాల రోగా నిర్ధారణ టెస్టులతో పాటు 64 రకాల మందులు అందిస్తున్నామని అన్నారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియ, ఏఎన్ఎం రాజేశ్వరి, సర్పంచ్ గార రమణ, ఆశా వర్కర్లు రాములమ్మ, సావిత్రి, ఆదిలక్ష్మి తదితరులు సేవలందించారు.

మరింత మెరుగ్గా సేవలందించాలి



సచివాలయంలో వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ

రాజాం: ప్రజలకు గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవల్లో విఘాతం కలగకుండా చూడాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పొగిరి గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా అందించిన సేవలతో పాటు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పలు ధ్రువీకరణ పత్రాల మంజూరీపై ఆరాతీశారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ముళ్లపొదల తొలగింపు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. జనావాసాల మధ్య ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగి, ప్రజలకు ఇబ్బందిగా మారిన ముళ్లకంపలు, పొదలు, తీగజాతి మొక్కలను తొలగించారు. వాసవీనగర్, ఎల్ఐసీ రోడ్డు, సారథిరోడ్డు, ఈశ్వరనారాయణకాలనీ వార్డుల్లో మినీ ప్రొక్లెయిన్ సాయంతో ఈ పనులు చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ పనులను పర్యవేక్షించారు.

కొలతల మేరకు పనులు చేస్తే గిట్టుబాటు వేతనం



సంతకవిటి: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ ఆర్.హరనాథరావు

సంతకవిటి: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను నిర్దేశిత కొలతల్లో చేయాలని ఏపీఓ ఆర్.హరనాథరావు అన్నారు. మండలంలోని శ్రీహరినాయుడుపేటలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డీఆర్పీ కోటితో కలిసి సోమవారం పరిశీలించారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనదారులకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. పండ్ల తోటలు పెంపకంపై వేతనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సింహాద్రి, మేట్లు పాల్గొన్నారు.

రాజాం సిటీ: వేతనదారులు రెండు పూటలా పనులకు హాజరుకావాలని ఏపీఓ కె.సాయిరాం సూచించారు. మండలంలోని సోపేరు, బొద్దాం గ్రామాల్లో దేశినాయుడు చెరువు, బింగివాని చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపడితే రూ.300లు వేతనం అందుతుందన్నారు. ఉదయం, సాయంత్రం చల్లటిగా ఉన్నప్పుడే పనులకు హాజరుకావాలన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు రావాలని సూచించారు. ఆయనతో పాటు టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.



రాజాం సిటీ: సోపేరులో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ సాయిరాం

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



పోతులజగ్గుపేట వద్ద నాగావళి నదిలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

సంతకవిటి: నాగావళి నదీతీరం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గనులశాఖ డీడీ సీ.హెచ్.సూర్యచంద్ర అన్నారు. మండలంలోని తమరాం, మేడమర్తి, పోతులజగ్గుపేట, రంగారాయపురం తదితర గ్రామాలలో సోమవారం పర్యటించి అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తున్నారా అని ఆరా తీశారు. నదీతీరం నుంచి అక్రమంగా ఇసుకను ఎవరైనా తరలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే సంబంధిత వాహనాన్ని సీజ్ చేస్తామని ఆర్డీఓ ఎస్.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ శ్రీధర్, తహసీల్దార్ సీ.హెచ్ తిరుమలరావు, ఇరిగేషన్ డీఈ ఎం.మురళీమోహన్, ఏఈ జి.వి.రమణ, వీఆర్ఓలు కరీమ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమికి మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న సింహాద్రినాయుడు

వంగర: నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూసారం పెరిగి భూమికి మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రి నాయుడు అన్నారు. మండలంలోని మరువాడ, కింజంగి గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి సాగు విధానంపై రైతులు ఆసక్తి చూపాలని కోరారు. నవధాన్యాలను తొలకరి చినుకులకు ముందు పొలంలో వేసుకోవడం వల్ల భూమికి కావాల్సిన పోషకాలు అందుతాయని, నేలలో నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. ఎరువుల వినియోగం తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. నవధాన్యాల విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని సూచించారు. ఐసీఆర్‌పీఓ పోలినాయుడు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయి

బాడంగి: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా పార్టీలకతీతంగా ప్రజలకు అందించిన సేవలే వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తెస్తుందని క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌ఛార్జ్, బిషప్ యజ్జల బాలరాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల అనంతరం తాను పలు ప్రాంతాల్లో తిరిగి పోలింగ్ సరళిపై ఆరా తీసినట్లు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకే మద్దతిచ్చినట్లు చెప్పారు. మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం చూస్తే.. వారంతా తమకు మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి రుణం తీర్చుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చినట్లు అనిపిస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎక్కడా ఎలాంటి అవినీతికి చోటివ్వకుండా, సంక్షేమ పాలన అందించారని అన్నారు. రాష్ట్రంలో 80 శాతం కుటుంబాలకు లక్ష నుంచి ఐదు లక్షల రూపాయల వరకు డీబీటీ విధానంలో అందించారని గుర్తు చేశారు. లబ్ధిదారులంతా జగన్ వెంటే ఉన్నారన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో శంబంగి చేసిన అభివృద్ధి పనులు ఆయనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయన్నారు. గెలుపు ఓటములు దైవాదీనమని, ప్రజలే న్యానిర్ణేతలని, మంచి తీర్పునే ఇస్తారని అభిప్రాయపడ్డారు. సమావేశంలో మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు పాల్గొన్నారు.

హెచ్‌టీ పత్తి విత్తనాలు వాడొద్దు

బాడంగి: మండలంలోని రైతులు నిషేధిత హెచ్‌టీ(హెర్బీసైడ్ టోలరెంట్) పత్తి విత్తనాలను వాడరాదని మండల వ్యవసాయాధికారి కె.శిరీష సూచించారు. మండలంలోని గొల్లాది రైతుభరోసా కేంద్రంలో సోమవారం రైతులతో సమావేశమయ్యారు. పత్తి సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కేవలం లైసెన్స్ ఉన్న షాపులలోనే మాత్రమే పత్తి విత్తనాలు, పురుగు మందులు, కలుపు మందులు కొనుగోలు చేయాలని, వాటికి తగిన రశీదులు పొందాలన్నారు. గ్లయిఫోసెట్ కలుపు మందును ప్రభుత్వం నిషేధించిందని, దాన్ని వినియోగించొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారులు దాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నామని, కావాల్సిన వారు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్ఎం రాజు

బాడంగి: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజరు డీఆర్‌కే రాజు అన్నారు. స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంక్ బ్రాంచ్‌ను కొత్తభవనంలోకి మార్పు చేయగా.. ఆదివారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాతభవనం ఇరుకుగా ఉండటం వల్ల ఖాతాదారులు ఇబ్బందులు పడేవారని, అందుకే విశాలమైన కొత్త భవనంలోకి మార్పుచేసినట్లు చెప్పారు. ఖాతాదారులకు మెరుగైన సేవలతో పాటు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.ప్రసాద్, సునీల్‌వర్మ, డి.గనేష్, యూనియన్ జనరల్ సెక్రటరీ గంట అప్పల నాయుడు, స్థానిక బీఎం బి.వెంకటేష్, సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై, అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తిరుమలరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జ్ఞానప్రసాద్‌తో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు విడుదలైనంత వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గ్రామాల్లో ఎక్కువ మంది గుమిగూడి తరగరాదన్నారు. ఎన్నికల రోజు వరకే రాజకీయాలు చేయాలని, ఎన్నికలు పూర్తయిన మరుక్షణం నుంచి ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయుకులు అన్నదమ్ముళ్లా కలసిమెలసి మెలగాలన్నారు. గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించిన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై రైడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన, బెట్టింగులకు పాల్పడిన వారి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

బడిఈడు దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే



దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారులు

మెంటాడ: పూర్వ ప్రాథమిక, బడిఈడు దివ్యాంగ పిల్లలను గుర్తించాలని బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.మోహనరావు అన్నారు. మండలంలో విద్యాశాఖ-సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సోమవారం బడి ఈడు, బడి బయట గల దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే చేపట్టారు. మెంటాడ, వెంకంపేట, కంటభుక్తవలస, జేడివలస గ్రామాలలో చేపట్టిన సర్వేను విద్యాశాఖాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. డిజిటల్ విద్యతో పాటు రైలింగ్ ర్యాంపులు, ఫ్రెండ్లీ టాయిలెట్లు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే వివిధ రకాల ఉపకరణాలు, ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే దివ్యాంగ పిల్లలకు విద్యాబోధన, ఫిజియోథెరపీ అందించేందుకు మండల కేంద్రంలో భవిత కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ మంగళవారం ఫిజియోథెరపీ సేవలందిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగ పిల్లలకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ యు.వి.ఎస్పీ శివాజీవర్మ, సహిత విద్య ఉపాధ్యాయులు ఆర్.చంద్రరావు, ఎస్.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు చేరుకున్న విత్తనాలు



నాయుడువలస ఆర్‌బీకేకి వచ్చిన విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని రైతుభరోసా కేంద్రాలకు ఖరీఫ్‌కు అవసరమైన వరి విత్తనాలు సోమవారం చేరుకున్నాయని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. ఎంటీయూ 1121 రకం వరి విత్తనాలు 3600 బస్తాలు, స్వర్ణ 770 బస్తాలు వచ్చాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఖరీఫ్‌కు ముందు భూసారం పెంచుకునేందుకు సాగుచేసే పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.